క్లుప్తంగా

వైద్యుల డైట్ క్యాంటీన్ ప్రారంభం



లబ్బీపేట(విజయవాడతూర్పు): విధుల్లో ఉన్న వైద్యులు భోజనం చేసేందుకు ప్రభుత్వాస్పత్రిలో డైట్ క్యాంటీన్‌ను అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దారు. ఈ ఆధునిక క్యాంటీన్‌ను శుక్రవారం రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ డి.నరసింహం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు భోజనం చేసేందుకు అన్ని వసతులతో క్యాంటీన్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. విశాలమైన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో వైద్యులు కూర్చుని ప్రశాంతంగా భోజనం చేసేందుకు ఏసీలతో పాటు అన్ని వసతులు ఏర్పాటు చేయడం మంచి పరిణామం అన్నారు. అనంతరం సిద్ధార్థ వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు ప్రభుత్వాస్పత్రికి అందచేసిన మార్చురీ ఫ్రీజర్ బాక్స్‌లను ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సొంగా వినయ్‌కుమార్, డెప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు డాక్టర్ అమ్మన్న, డాక్టర్ వీఎస్ వరప్రసాద్, ఎనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ ఎవీరావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కి 25 పరుపులు అందజేత



లబ్బీపేట(విజయవాడతూర్పు):కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు ఉపయోగపడేలా 25 పరుపులను శుక్రవారం ప్రభుత్వాస్పత్రికి అందజేశారు. ఈ సందర్భంగా పాత ప్రభుత్వాస్పత్రిలో లారీ ఓనర్స్ ఫౌండేషన్ సభ్యులు ఆస్పత్రి అధికారులకు సుమారు రూ.70 వేలు విలువ కలిగిన పరుపులు అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నాయకులు మాట్లాడుతూ రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు కోనేరు వెంకట రామారావు, ఉపాధ్యక్షుడు మేరుగ అక్కయ్యనాయుడు, కార్యదర్శి కుర్ర సాయిరాం, సహాయ కార్యదర్శి కోనేరు రాధాకృష్ణ తదితరులున్నారు.







మహాలక్ష్మీ నమోస్తుతే..

పవిత్ర శ్రావణ శుక్రవారం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మహాలక్ష్మీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో దేవాలయం కిటకిటలాడింది. క్యూలైన్లు బారులు తీరి కనిపించాయి. పూలతో ఆలయాన్ని అలంకరించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ



కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి కార్పొరేటర్ నరేంద్ర రాఘవ

భవానీపురం(విజయవాడపశ్చిమ):నగరపాలక సంస్థ సర్కిల్–1 పరిధిలోగల 39వ డివిజన్‌లోని 117వ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి కల్పించటంలో భాగంగా నగరంలో మొత్తం 19 కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అందులో ఇది తొలి కేంద్రమని తెలిపారు. పొదుపు సంఘాలకు సున్నా వడ్డీకి రుణాలు, ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా దేశంలో మరెక్కడా లేని విధంగా అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు. మహిళా సాధికారత, స్వావలంబన కోసం ప్రభుత్వం కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి వారికి ఆర్థిక ప్రయోజనాలను చేకూరుస్తుందన్నారు. అదే విధంగా మహిళలు నిర్వహిస్తున్న వివిధ వ్యాపారాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ మాట్లాడుతూ ఇప్పటికే మహిళల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని తొలిగా తమ డివిజన్‌లో ప్రారంభించటంతో డివిజన్‌లోని పలువురు మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ యూసీడీ విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, వీఎంసీ సర్కిల్–1 ఇన్‌చార్జ్ సీడీఓ, టెక్నికల్ నిపుణుడు డాక్టర్ ఫణి కుమార్, టీఈ రమ్యకృష్ణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ దేవి అలంకారంలో కాళీమాత అమ్మవారు



వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకారంలో కాళీమాత అమ్మవారు

కృష్ణలంక(విజయవాడతూర్పు):శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా బస్టాండ్ సమీపంలోని కాళీమాత దేవస్థానం (త్రిశక్తి పీఠం)లో కాళీమాత అమ్మవారు వరలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుహాసినిలచే వరలక్ష్మీ వ్రతం శోభయామానంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు క్యూలైన్‌లో వేచిఉండి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వ్యాకరణ శ్రీనివాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, వరలక్ష్మీ పూజ, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు పూర్ణాలు, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజలను ఆలయ ఆధ్యాత్మిక సలహాదారుడు బి.హెచ్.విజయకిరణ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్, సభ్యులు జి.సత్యం, ఆలపాటి జగన్, ఎం.రాజా, ఆలయ సూపరింటెండెంట్ మధుసూదనరావు పర్యవేక్షించారు.

బీపీ మండల్ చిరస్మరణీయుడు

భవానీపురం(విజయవాడ పశ్చిమ):బీసీలకు రిజర్వేషన్లు కల్పించటంలో విశేష కృషి చేసిన బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వర్ ప్రసాద్ మండల్ (బీపీ మండల్) చిరస్మరణీయుడని ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు అన్నారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకుని అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాధరపురంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత బీపీ మండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల సర్వీస్‌లో 27 శాతం రిజర్వేషన్ కల్పించిన మహానుబావుడు బీపీ మండల్ అన్నారు. దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీల కోసం 11 రకాల జీవన ప్రమాణాలను కొలమానంగా తీసుకుని సుమారు మూడు వేలకుపైగా కులాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను అందించిన వ్యక్తి అన్నారు. కేంద్ర, రాష్ట్ర విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు సాధించటానికి మూల కారకుడు బీపీ మండల్ అని వివరించారు. బీసీలందరి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు.

వీఎంసీ సిటీ ప్లానర్‌గా వల్లభనేని సునీత..?

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అధికారి జీవీజీఎస్‌వీ ప్రసాద్‌ను బదిలీ చేసినట్లు సమాచారం. ఆయన స్థానంలో గ్రేటర్ విశాఖకు చెందిన చీఫ్ సిటీప్లానర్ వల్లభనేని సునీతను ఇక్కడను రానున్నారు. ఆమె 2015–16లో విజయవాడలో అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా విధులు నిర్వర్తించారు. అనంతరం ఆమె ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్స్ రెగ్యులారిటీ (ఏపీ రేరా) అధికారిగా పనిచేశారు. అనంతరం ఆమెను గ్రేటర్ విశాఖకు వెళ్లగా ఇప్పుడు మళ్లీ విజయవాడకు చీఫ్ సిటీ ప్లానర్‌గా బదిలీపై వస్తున్నారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు అనుకూలంగా వ్యవహరించిందని ఆమెపై గతంలో ఆరోపణలు కూడా ఉన్నాయి. గుంటూరు, విశాఖపట్నంలో కూడా రెండు నెలలు మాత్రమే విధులు నిర్వహించగా ఆమెపై ఆయా ప్రాంతాల్లో పలు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం చీఫ్ సిటీ ప్లానర్‌గా ఉన్న ప్రసాద్ విశాఖకు బదిలీ అయ్యారని తెలిసింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

బీఎస్ఎన్ఎల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాలరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్):సెప్టెంబర్ 12న జరిగే బీఎస్ఎన్ఎల్ మూడవ మెంబర్‌షిప్ వెరిఫికేషన్ (జాతీయ ఎన్నికలు) లో ఆలిండియా గ్రాడ్యుమేట్ ఇంజినీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్‌ను బలపరచాలని రాష్ట్ర కార్యదర్శి డి.వేణుగోపాలరావు కోరారు. స్థానిక చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ భవన్‌లో శుక్రవారం ఎగ్జిక్యూటివ్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆలిండియా గ్రాడ్యుమేట్ ఇంజినీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని చెప్పారు. పెండింగ్ హెచ్ఆర్‌కు సంబంధించిన విషయాలను పరిష్కరిస్తామని ఉద్యోగస్తులకు హామీ ఇచ్చారు. బీఎస్ఎన్ఎల్ మనుగడను కొనసాగిస్తామని, ఈ 2, ఈ 3 పే స్కేల్స్ సమస్యలను పరిష్కరిస్తామని, ఇ–1ఎ పే స్కేల్‌లో ఉద్యోగం పొందిన ఎగ్జిక్యూటివ్ కి రూ.22,820 ప్రారంభ బేసిక్ సమస్యను, 30 శాతం సూపర్‌యాన్యుయేషన్ బెనిఫిట్‌ని కూడా పరిష్కరిస్తామని, జనవరి ఒకటి, 2017 నుంచి మూడో వేతన సవరణ కమిటీ సిఫారసులను అమలుపరిచేలా తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఏఐజీఈటీవోఏ జాతీయ అధ్యక్షుడు జి. వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి రవి షీల్ వర్మ, కన్వీనర్ అండ్ చీఫ్ ప్యాట్రన్ అఫ్తాబ్ అహ్మద్ ఖాన్, సహాయ కార్యదర్శి ఫజల్ అహ్మద్, సంయుక్త కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఏపీ సర్కిల్ అధ్యక్షుడు కె.హరిబాబు తదితరులున్నారు.

భర్త అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్:తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా శుక్రవారం కేసు నమోదు చేశారు. వించిపేటకు చెందిన షేక్. ముంతాజ్, ఆసీఫ్ భార్యాభర్తలు. ఆసీఫ్‌కు మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో వైద్యం చేయిస్తున్నారు. తన భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.